కొత్త ఫీచర్ ప్రారంభం

వేదుల చిన్న వేంకట చయనులు

# మాలోకం కథలు

## ముందు మాట

మన భూలోకంలాంటిది సృష్టిలో మరో లోకముందా? ఇంతవరకూ లేకపోయినా మున్ముందు ఉండబోతుందా అన్ని శాస్త్రజ్ఞులు అత్యంత కుతూహలంతో అద్వితీయమైన శక్తి సామర్థ్యాలతో అంతరిక్షానికి అనేక యంత్రాలను పంపి వాటి ఆమాకీ కనుగొన ప్రయత్నిస్తున్నారు. చంద్రమండలంలో దిగి అక్కడ మన వాతావరణం లేదని మార్స్‌మీద కన్ను తిప్పారు.

హబుల్ టెలిస్కోపుతో ఊహాతీతమైనంత దూర క్షేత్రాలని చూస్తున్నామంటున్నారు. ఐనా అసలు ప్రశ్నకు ఇంతవరకూ ఇదమిద్ధంగా ఏదీ తేలలేదు.

శాస్త్రం రుజువు చేయకపోవచ్చు. కల్పనకు ఆధారాలు అక్కరలేదు. మా లోకం నా కల్పన. అందులో భూలోకంలో వున్న ప్రతిదానికీ అడ్డదిడ్డమంటే పెడదిడ్డమంటారు. ఇందులోని కథలకి మూలములు ప్రపంచ ఖ్యాతి పొందిన 'ఏసప్', 'పంచతంత్ర కావ్యము'లలోని నీతి కథలే. మాలోకం రివాజుగా వాటిని కొంచెమడదిడ్డముగా తిప్పి కూర్చబడినవి. అందుకని ఇవి సరికొత్త పాత కథలనవచ్చును. ఏ లోకం తీసుకున్నా బహుశా నీతులు ఒకటేనేమో.

చిన్నతనంలో మూల కథలను చదివి, కొంచెం పెద్దయ్యాక ఈ కథలు చదివి వీటిలోని వ్యంగ్యాన్ని గుర్తించి మూలకథల నీతులు నెమరు వేసుకుంటూ ఈ కథలలోని నీతులను కూడా ఓ చిరునవ్వుతో స్వీకరించగలరనే నా ఉద్దేశమూ, ఆశయమూ.

– రచయిత

## బ్రాహ్మణుడు - బంగారు కంకణం

అనగనగా ఒక ఊళ్లో ఒక పేద బ్రాహ్మణుడు ఉండేవాడు. ఎంత కష్టపడి యాచించినా ఏ రోజుకారోజే అత్తెసరు బ్రతుకేగానీ ముసలి రోజులకి మిగిలినదేమీ లేదు. ఒకరోజు వంటకని ఆకు అలమలు ఏరుకుందామని ఊరవతల వున్న అడవికి వెళ్లాడు. అడవిలో కొంత దూరం వెళ్లాక ''బ్రాహ్మణోత్తమా'' అని దూరంనుంచి ఎవరో పిలిచినట్లయింది. నలుదిక్కులూ చూడగా ఒక పులి కనబడింది.

ముసలివాడైనా ప్రాణాలు కాపాడుకోవాల్సి వచ్చేటప్పటికి దానంతట అదే శక్తి వచ్చింది. గబగబా దగ్గరగా వున్న ఓ చెట్టెక్కాడు. ఆ పులి చెట్టు దగ్గరకు వచ్చి ''ఇదుగో చూడు, ఈ బంగారు కంకణం నీకియ్యదలచి పిలిచాను. భయపడకు. నరమాంసం తినే గతి నాకింకా పట్టలేదు. మొన్న ఈ దారిన వెళ్తూండగా ఈ బంగారు కంకణం కనబడింది. పాపం, ఏ పండితోత్తముడో పోగొట్టుకున్నట్లుంది. సువర్ణ దానం చేస్తే వచ్చే జన్మకైనా నాకు మంచి జన్మ లభించి ఈ దిన దిన వేట, జీవహింస చేసి కడుపు నింపుకోవడం తప్పుతుందేమో అనే చూస్తున్నా: మనుషులందరిలో బ్రాహ్మణుడికి దానం చేస్తే అది గొప్పదన్నారు మన పెద్దలు. అందుకనే బ్రాహ్మణుడెవడైనా వస్తాడా అనే కాచుకుని ఉన్న నా కంటికి కనబడి నాకెంతో ఆనందమిచ్చావు. రా, భయపడకు'' అని ఆప్యాయంగా పిలిచింది.

అప్పుడా బ్రాహ్మణుడు ''నువ్వు క్రూరజంతువువి. నీ మాట నమ్మరాదని అంటారు. ఐనా నీకది ఇవ్వాలన్న మంచి బుద్ధి పుట్టింది కనుక అదక్కడ ఉంచి నీ దారిన పో. నేనది సావకాశంగా దిగి తీసుకుంటాను'' అని చెప్పాడు.

''గిరవాటు వేస్తే దానఫలమెక్కడ ఉంటుంది? అసలు నా దగ్గర ఇంకేమీ ఫలం, పుష్పం లేవుగాని కనీసం చేతిలో పెట్టి నమస్కరించినా శాస్త్రం ఒప్పుతుంది అంటారు కదా. నువ్వు దగ్గరగా వస్తే ఆ పని చేసి నేవెళ్లిపోతా. నన్ను కనికరించి కిందకు దిగు'' అని బ్రతిమాలింది.

ససేమిరా రానని ఆ బ్రాహ్మణుడు ఆ చెట్టుమీదే కూర్చుంటే చూసి చూసి ఆకలవుతోందని తన వేటకి పులి పరుగు తీసింది. ఆ బ్రాహ్మణుడు ఇంటికెళ్లాక జరిగినది సావకాశంగా ఆలోచించాడు. 'పులి చెప్పినది నిజమే అయి ఉండాలి. లేకుంటే ఓ పట్టాన్న వదిలేదా? నన్ను తినేయాలని ఉంటే నే చెట్టెక్కేలోగా ఒక్క చెంగున వచ్చి మింగేయగలదు. బంగారు కంకణం చేజేతులా వదులుకుని తెలివితక్కువగా ప్రవర్తించాను. వెర్రిబాగులది! దగ్గరకు పిలిచి తుపాకీతో కొట్టేస్తే దాని తోలు కూడా అమ్మి సొమ్ము చేసుకొనవచ్చును' అని తట్టింది.

బ్రాహ్మణుడు మరునాడు మళ్ళీ అడవిలోకి వెళ్లాడు. అక్కడ ఉన్న చెరువులో సంధ్య జపం చేసుకుంటూన్నట్లు సహం నీటిలో, సహం పైకీ దేహముంచి నీటిలో కనపడకుండా కాలు దగ్గర తుపాకీ ఉంచి ముక్కు మూసుకుని ఎప్పుడు పులి వస్తుందా అని అలా నిలుచున్నాడు. ఓ రెండు గంటలు నిలుచుని పులి జాడే కనపడక కాళ్ళు పీకెడుతున్నాయని తన ప్రయత్నం మానుకుందామని అనుకున్నాడోలేదో దూరం నుంచి పోతూన్న పులిని చూసాడు.

''ఓ బెబ్బులీ కుశలమేనా? నిన్న చూపించిన కంకణం ఇంకా ఉన్నదా? దానం పుచ్చుకోడానికి ఇదుగో అర్ఘ్యము కూడా సిద్ధముగా ఉన్నది'' అని గొంతెత్తి పిలిచాడు.

పరమ సంతోషంతో ''ఉంది బాబూ, ఇదుగో'' అని పంజాలో దాచిన కంకణాన్ని చూపించుతూ చెరువు చేరుకునేందుకు ఆ పులి చెంగులు వేసింది. దగ్గరగా వచ్చేవరకూ అలాగే నిలుచుని దాచి ఉంచిన తుపాకీ తీసి ఒక్క గుండుతో సరిగ్గా దాని గుండెలో కొట్టాడు. ఆ దెబ్బకు దాని ప్రాణం పోయింది.



**మాలోకం నీతి: నీచానికి మనిషిదే పైచేయి.**

★